నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్ - మేడ్చల్
13 హైదరాబాద్, బుధవారం 31 జనవరి 2024 | HYDERABAD



**మహాత్ముడికి నివాళి** ▸ మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా బాపూఘాట్ వద్ద గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన సీఎం రేవంత్‌రెడ్డి



నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

## కుర్మల్‌గూడ అక్రమాలపై..
# కలెక్టర్ కన్నెర్ర

**సర్వే నంబర్ 46లో జారీచేసిన ఇంటి నంబర్లు రద్దు**

**డీసీపీ కార్యాలయంలో అధికారులతో కలెక్టర్ సమావేశం**

**అన్ని ప్రాంతాల్లో అక్రమాలను తొలగించాలని ఆదేశాలు**

**'నమస్తే తెలంగాణ' వరుస కథనాలతో కదిలిన ప్రభుత్వ యంత్రాంగం**

బడంగ్‌పేట, జనవరి 30 : బాలాపూర్ మండల పరిధిలోని ప్రభుత్వ భూముల కబ్జాపై ఎట్టకేలకు అధికారులు స్పందించారు. చర్యలు తీసుకోవడానికి రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది. 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ఇటీవల కుర్మల్‌గూడలో అక్రమ నిర్మాణాలు అనే శీర్షికన వరుస కథనాలు ప్రచురితం కావడంతో జిల్లా కలెక్టర్ శశాంక్ స్పందించారు. సోమవారం మహేశ్వరం డీసీపీ కార్యాలయంలో డీసీపీ సునీతా రెడ్డి, ఆర్డీవో సూరజ్ కుమార్, ఏసీపీ శ్రీనివాస్, తాసీల్దార్ మాదవి రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు సుమన్ రావు, వసంత, నీటి పారుదల అధికారులతో సమావేశం ఏర్పాటు చేసిన్నట్లు సమాచారం.



## వేలానికి అమెరికా
# కాన్సులేట్ వస్తువులు

**కార్లు, ల్యాప్‌టాప్, ఫర్నిచర్‌తో సహా పలు ఉపకరణాలు**

సిటీబ్యూరో, జనవరి 30(నమస్తే తెలంగాణ) : అమెరికా కాన్సులేట్‌కు చెందిన వస్తువులు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, వాహనాలను వేలం వేసేందుకు అధికారులు సన్నాహాలు చేశారు. బేగంపేట్ నుంచి నానక్ రాంగూడకు కాన్సులేట్ కార్యాలయాన్ని గతేడాదిలో మార్చారు. ఈ క్రమంలో పాత కార్యాలయంలో ఉన్న వస్తువులను అర్హత కలిగిన గుత్తేదారులకు విక్రయించేందుకు నోటీసులను జారీ చేశారు. 31 వరకు రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించగా.. నిర్ణీత మొత్తం చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 1 ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఈ వేలంలో యూఎస్ కాన్సులేట్ అధికారులు పేర్కొన్న వస్తువులను లాట్ ప్రాతిపదికన విక్రయించనున్నారు. వివరాలకు https://www.accurateauctioneers.in సంప్రదించాలన్నారు.



*ఈ చిత్రంలో* కనిపిస్తున్న నిర్మాణం శేరిలింగంపల్లి జోన్ ప్రశాంత్‌హిల్స్ కాలనీలోని ప్లాట్ నం.175, 166కు సంబంధించినది.. సదరు భవన నిర్మాణ యాజమాని అడుగడుగునా నిబంధనలను ఉల్లంఘించారు. జీ+4 అంతస్తులకు నిర్మాణ అనుమతి తీసుకొని క్షేత్రస్థాయిలో మాత్రం నిబంధనలకు మించి అంతస్తుల మీద అంతస్తులు కడుతూనే ఉన్నాడు. ఇప్పటికే ఆరు అంతస్తుల నిర్మాణం పూర్తి చేసుకొని అపై నిర్మాణానికి వెనుకాడడం లేదు.. అదనపు అంతస్తులతో పాటు కనీస సెట్‌బ్యాక్ నిబంధనలు పాటించడం లేదు.. ఈ అక్రమ నిర్మాణంపై స్థానికులు గాయత్రి స్థానిక టౌన్‌ప్లానింగ్, జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. దీంతో నేరుగా జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపడితే ఇప్పటికే రెండు సార్లు ఈ నిర్మాణంలో అక్రమాలు జరిగాయని, సదరు యాజమానికి నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. కానీ చర్యలు తీసుకోకపోవడంతో నేటికి యథేచ్ఛగా నిర్మాణం జోరుగా కొనసాగుతూనే ఉన్నది. ఇది కేవలం మచ్చుతునక మాత్రమే. జీహెచ్ఎంసీ పరిధిలో ఇటువంటి నిర్మాణాలు కొకొల్లలు అని చెప్పవచ్చు. భవన నిర్మాణానికి అనుమతి తీసుకొని కమర్షియల్‌గా నిర్మాణం చేపట్టడం అనవాయితీగా మారుతున్నది. ఇంటి అద్దెలకు డిమాండ్ ఉండడం.. ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల డిమాండ్ దృష్ట్యా హాస్టల్‌కు ఇచ్చే వ్యాపారంగా మలుచుకుంటున్నారు. ఐటీ కారిడార్‌లో ఇప్పుడు ఇదే ట్రెండ్ నడుస్తున్నదని, లంచం ఇచ్చి అదనపు అంతస్తులు కట్టుకుంటున్నారని కొందరు యాజమానులు బాహాటంగానే చెబుతున్నారు.

## అక్రమాల
# ప్లానింగ్

**అనుమతి లేకుండానే అకాశహర్మ్యాలు**

**అడుగడుగునా నిబంధనల ఉల్లంఘన**

**ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం**

**మామూళ్లు దండుకొని.. నోటీసులతో సరిపెడుతున్న టౌన్‌ప్లానింగ్ బృందాలు**

**ప్రధాన కార్యాలయానికి క్యూ కడుతున్న ఫిర్యాదుదారులు**

**నగరంలో పలుచోట్ల అక్రమంగా వెలుస్తున్న బహుళ అంతస్తుల భవనాలు అధికారుల అంతులేని నిర్లక్ష్యానికి పరాకాష్టగా నిలుస్తున్నాయి. టౌన్‌ప్లానింగ్ ఉన్నా.. లేనట్లే అని చెప్పవచ్చు.. ఇందుకు రెండు రోజుల క్రితం నిర్వహించిన ప్రజావాణిలో 138 ఫిర్యాదులు రాగా.. అందులో 37 ఫిర్యాదులు ఒక్క అక్రమ నిర్మాణానికి సంబంధించినవే కావడం గమనార్హం. టౌన్ ప్లానింగ్ అంటే అక్రమాలకు ప్లానింగ్ ఇచ్చేది వీరేనని పలువురు చెప్పకుంటున్నారు.**

సిటీబ్యూరో, జనవరి 30 (నమస్తే తెలంగాణ) : విచ్చల విడిగా అక్రమ, అనధికార, అదనపు అంతస్తుల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయని చెప్పడానికి జీహెచ్ఎంసీకి అందుతున్న ఫిర్యాదులే నిదర్శనమని చెప్పవచ్చు. జీహెచ్ఎంసీ ప్రతి సోమవారం సర్కిల్, జోనల్, సంస్థ ప్రధాన కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలు అందించిన ఫిర్యాదులను స్వీకరిస్తున్నది. అయితే ఎక్కువ శాతం టౌన్‌ప్లానింగ్‌కు సంబంధించినవే అధికంగా ఉంటున్నాయి. రెండు రోజుల క్రితం నిర్వహించిన ప్రజావాణిలో 138 ఫిర్యాదులలో 37 ఫిర్యాదులు ఒక్క అక్రమ నిర్మాణాలకు సంబంధించినవే ఉన్నాయి. దీన్ని బట్టి చూస్తే గ్రేటర్‌లో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయన్నది అక్షరసత్యం. ఎక్కువ శాతం అసలే అనుమతులు లేకుండా నిర్మాణాలు జరిగితే .. పర్మిషన్ తీసుకున్నామని చెబుతూనే ప్లాన్ ప్రకారం నిర్మాణం చేపట్టకుండా.. కనీస మౌలిక వసతులు, పార్కింగ్ సదుపాయం లేకుండా.. సెట్‌బ్యాక్ నిబంధనలు పాటించకుండా కమర్షియల్ భవనాలను కట్టేస్తున్న దాఖలాలు అత్యధికంగా ఉంటున్నాయి. ఈ నేపథ్యంలోనే డిమాండ్ కలిగిన ఏరియాలో మాత్రం ఒక్కో అంతస్తుకు రూ.లక్ష నుంచి మూడు లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారన్న అరోపణలు ఉన్నాయి. సామాన్యులు, మధ్య తరగతి ప్రజలకు చెందిన చిన్న చిన్న నిర్మాణాలపై అధికారులు ప్రతాపం చూపిస్తున్నారే తప్ప క్షేత్రస్థాయిలో బడా నిర్మాణాల జోలికి వెళ్లపోవడం పట్ల విమర్శలు వినిపిస్తున్నాయి. ఎక్కువ కాలంగా ఒకే చోట తిష్ట వేసిన ఏసీపీలు, టీపీఎస్, చైన్‌మెన్లను మార్చాలన్న డిమాండ్‌లు వ్యక్త మవుతున్నాయి.

### నామమాత్రంగా ఎన్‌ఫోర్స్‌మెంట్

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులను స్వీకరించి చర్యలు తీసుకోవాల్సిన జోనల్ స్థాయి ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలను జీహెచ్ఎంసీ నిర్వీర్యం చేసింది. జోనల్ కమిషనర్ల ఆధ్వర్యంలో పని చేస్తాయంటూ కేంద్ర కార్యాలయం నియమించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు ప్రస్తుతం నామమాత్రంగానే ఉన్నాయి. ఫలితంగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని క్షేత్రస్థాయి పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి.

## పోకిరీ మొగుళ్లను
# పొట్టు పొట్టు కొట్టేండ్రు

**వంకర బుద్ధికి.. షీటీమ్స్ కళ్లెం**

**వయస్సుతో సంబంధంలేకుండా వెకిలి చేష్టలు**

**షీ టీమ్స్‌కు పట్టుబడుతున్న పోకిరీలు**

**కుటుంబ సభ్యుల సమక్షంలో వారికి కౌన్సెలింగ్**

సిటీబ్యూరో, జనవరి 30 (నమస్తే తెలంగాణ): నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ రద్దీగా ఉంటుంది.. ఈ రద్దీలో ఒకరికొకరు తగులుతూ కొన్ని సందర్భాల్లో ముందుకెళ్తుంటారు.. అలా శంకరయ్య (పేరు మార్చాం..) ముందుకెళ్తూ తననెవరూ చూడడం లేదనుకొని ముందున్న మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు.. రద్దీలో బాధితులు వెనక్కి చూసే లోపు శంకరయ్య.. బిత్తిరి చూపులతో తనకేమి తెలియనట్లు ప్రవర్తిస్తున్నాడు. ఇంతలో అక్కడున్న షీ టీమ్స్ అతన్ని పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. తనకేమి తెలియదంటూ అమాయకంగా ప్రవర్తించాడు. అయితే మీ భార్యను తీసుకొని రేపు కౌన్సెలింగ్‌కు రావాలని షీ టీమ్స్ సిబ్బంది సూచించారు. దీంతో మరుసటి రోజు భార్యతో వచ్చిన శంకరయ్య చేష్టలను వీడియోలో చూసిన భార్య అతడి చెంప చెల్లు మనిపించింది. ఇలా షీ టీమ్స్‌కు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడుతున్న వారి చేష్టలను చూసి చాలా మంది కుటుంబ సభ్యులు నిశ్చేష్టులవుతున్నారు. ఇంట్లో తల్లిదండ్రులకు, పెద్దవాళ్లైతే భార్యలకు తమ నిజ స్వరూపం తెలిసిపోతుండడంతో చేసేది లేక మన్నించాలంటూ వేడుకుంటున్న ఘటనలు జరుగుతున్నాయి. బస్‌స్టాప్‌లు, రద్దీగా ఉండే ప్రాంతాలలో షీ టీమ్స్ పోకిరీలను పట్టుకోవడం కోసం ఈ ఆపరేషన్ నిర్వహిస్తుంది. ఇందులో భాగంగా నిందితుల చేష్టలను వీడియోలు తీస్తుంది. పూర్తి సాక్ష్యాలు చేతికందిన వెంటనే ఆయా పోకిరీలను అదుపులోకి తీసుకొని షీ టీమ్స్‌కు తరలిస్తుంటారు. ఆ తరువాత వారు చేసిన తప్పులను బట్టి కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు కేసులు నమోదు చేస్తున్నారు. పెండ్లైన వారైతే వారి భార్యలను కౌన్సెలింగ్‌కు పిలిపిస్తున్నారు. తన భర్త మంచివాడని, ఎలాంటి తప్పు చేయడంటూ షీ టీమ్స్ ముందు వాదిస్తుంటారు. అయితే కౌన్సెలింగ్ చేసే వారు ఒక్కసారి ఈ వీడియో చూడండంటూ వారి భార్యలకు చూపిస్తున్నారు. దీంతో ఆ వీడియోలను చూసిన సదరు భార్య శివంగిలా మారి, కొందరు భర్తల చెంపలు చెల్లుమన్పిస్తున్నారు. అలాగే పెండ్లి కాని యువత, మైనర్ పిల్లల విషయంలోనూ తల్లిదండ్రులను పిలిచి వీడియోలు చూపిస్తున్నారు. అయితే ఈ కౌన్సెలింగ్‌తో పోకిరీల మైండ్‌సెట్ మారుస్తున్నామని నగర మహిళా భద్రత డీసీపీ కవిత తెలిపారు.




## కార్పొరేటర్‌నే బిల్లు అడుగుతవా ?

మాదన్నపేట, జనవరి 30: విద్యుత్ చార్జీలు వసూలు చేసేందుకు వెళ్లిన బిల్ కలెక్టర్‌పై ఓ కార్పొరేటర్ కుటుంబ సభ్యులు దాడి చేశారు. ఈ ఘటన మాదన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ కథనం ప్రకారం.. విద్యుత్ బిల్లులు వసూలు చేస్తున్న ఉద్యోగి రజినీష్ బాబుపై కుర్మాగూడ కార్పొరేటర్ మహాపారా సోదరుడు షరాఫత్, ఓ అడ్వకేట్, మరో నలుగురు కలిసి దాడి చేశారు. కార్పొరేటర్ ఇంటి విద్యుత్ బిల్లు దాదాపు ఏడాది కాలంగా చెల్లించడంలేదు. ఈ బిల్లు వసూలు కోసం బిల్ కలెక్టర్ వెళ్లగా.. దాడి చేశారు. బిల్ కలెక్టర్‌కు గాయాలు కావడంతో స్థానిక దవాఖానకు తరలించారు. ఈ దాడిపై సీఐటీయూ ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



## జాతీయ సదస్సులో ప్రభుత్వ స్కూల్ టీచర్ ప్రసంగం

సిటీబ్యూరో, జనవరి 30 (నమస్తే తెలంగాణ) : ఢిల్లీలోని విశ్వ యువ కేంద్రంలో 'నేషనల్ సెంటర్ ఫర్ స్కూల్ లీడర్‌షిప్' ఆధ్వర్యంలో ఈ నెల 29 నుంచి 31 వరకు నిర్వహిస్తున్న జాతీయ సదస్సుకు జిల్లాలోని నెహ్రూ మెమోరియల్ ప్రభుత్వ పాఠశాలలో గణితం టీచర్‌గా ఉద్యోగం చేస్తున్న వుమ్మాజి పద్మప్రియ మంగళవారం పాల్గొని ప్రసంగించారు. ఈ సదస్సుకు వివిధ రాష్ట్రాల నుంచి మొత్తం 70మందికి అవకాశం దక్కగా.. అందులో పద్మప్రియ ఒకరిగా నిలిచారు. దేశ వ్యాప్తంగా 400 కేస్ స్టడీస్, 30 పరిశోధన పత్రాలు రాగా తెలంగాణ రాష్ట్రం నుంచి తొమ్మిది మంది ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. వీరిలో పద్మప్రియ ఉండడంతో ఆ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్ అభినందించారు.

## పాత కంపెనీపై..
# పగ తీర్చుకునేందుకు

**సీఐడీ పేరుతో.. ఐటీ సంస్థపై దాడి**

**సెటిల్‌మెంట్ కోసం 2.3 కోట్లకు బేరం.. 12.5 లక్షలతో పరార్**

**డైరెక్టర్, ఉద్యోగులను కిడ్నాప్ చేసి సినీపక్కీలో హైడ్రామా**

**సంస్థలో పనిచేసి మానేసిన వ్యక్తియే ప్రధాన నిందితుడు**

శేరిలింగంపల్లి, జనవరి 30 : సీఐడీ అధికారులమంటూ గచ్చిబౌలిలోని ఓ ఐటీ సంస్థపై దాడిచేసిన ముఠా రూ.12.5 లక్షలు కొల్లగొట్టారు. మొత్తం రూ.2.3 కోట్లకు బేరం కుదుర్చుకొని సంస్థ డైరెక్టర్, ఉద్యోగులను కిడ్నాప్ చేసి సినీపక్కీలో హైడ్రామా కొనసాగించారు. చివరకు సంస్థ డైరెక్టర్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేపట్టిన రాయదుర్గం పోలీసులు 8 మంది నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గచ్చిబౌలిలోని కార్యాలయంలో మాదాపూర్ డీసీపీ జి.వినిత్ మంగళవారం మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. గచ్చిబౌలి డైమండ్‌హిల్స్‌లో అజా యాడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో షేక్‌పేట్ ఓయూ కాలనీకి చెందిన అక్కెర రంజిత్‌కుమార్(47) మేనేజర్‌గా పనిచేసేవాడు. తనకు వేతన పెంపుతో పాటు ప్రమోషన్ ఇవ్వలేదని సంస్థపై పగతీర్చుకోవాలని భావించిన రంజిత్‌కుమార్ కర్నూల్ జిల్లా మైదకూర్ ప్రాంతానికి చెందిన అడ్వకేట్ పొలిమేర మహేంద్ర కుమార్(38)కి విషయం చెప్పాడు. మహేంద్రకుమార్ తనకు పరిచయం ఉన్న కర్నూల్ డీఐజీ కార్యాలయంలో ఎస్ఐగా పనిచేసిన సుజన్‌కు విషయం చెప్పాడు. ఈ క్రమంలో కడప జిల్లాకు చెందిన షేక్ మహమ్మద్ అబ్దుల్ ఖాదిర్, విజయ్‌శేఖర్(32), బలిగ రాహుల్(33), దాడిబోయిన ఉబ్బకృష్ణ(40), పొన్నోలు సందీప్‌కుమార్(31), భూపతి రఘురామరాజు(33), రాజాతో కలిసి ముఠాగా ఏర్పడి సీఐడీ అధికారులుగా నకిలీ కార్డులు సృష్టించుకున్నారు. ఈ నెల 26న అర్ధరాత్రి 1:30 గంటల సమయంలో అజా యాడ్స్ కార్యాలయంలో సీఐడీ అధికారులుగా దాడులు నిర్వహించినట్లు హడావుడి చేశారు. సంస్థ డైరెక్టర్ దర్శన్ సుగుణాకర్ శెట్టిని పిలిచి రూ.2.3 కోట్లకు సెటిల్ చేసుకోవాలని ఒప్పందం కుదుర్చుకున్నారు. అప్పటికప్పుడు సంస్థకు చెందిన మూడు బ్యాంకు ఖాతాల నుంచి రూ.71.80 లక్షలు ఇస్తామని తెలుపగా మొత్తం డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డబ్బులు వచ్చే వరకు సంస్థకు చెందిన దర్శన్, హరిప్రసాద్, చేతన్‌లను తమ ఆధీనంలో ఉంచుకుంటామని డైరెక్టర్ సుగుణాకర్‌కు చెప్పి మాదాపూర్‌లోని ఓ హోటల్‌కు 27న ఉదయం తీసుకెళ్లారు. వారి వద్ద ఉన్న ఏటీఎం కార్డుల ద్వారా రూ.2.5 లక్షలు డ్రా చేయడంతో పాటు రూ.10 లక్షలు ఇతర అకౌంట్లకు ట్రాన్స్‌ఫర్ చేయించుకొని వారిని హోటల్ గదిలోనే వదిలేసి పారిపోయారు. సుగుణాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న రాయదుర్గం పోలీసులు విచారణ చేపట్టారు. ప్రదాన సూత్రదారి మహేంద్రకుమార్‌తో పాటు గ్యాంగ్ సభ్యులు అబ్దుల్ ఖాదిర్, విజయ్ శేఖర్, రంజిత్‌కుమార్, రాహుల్, సుబ్బకృష్ణ, సందీప్‌కుమార్, రఘురాజులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.35 వేల నగదు, దోపిడీకి ఉపయోగించిన 4 కార్లు, 16 సెల్ ఫోన్లు, 2 ల్యాప్‌ట్యాప్‌లను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. సుజన్, రాజు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సమావేశంలో మాదాపూర్ ఏడీసీపీ నంద్యాల నర్సింహారెడ్డి, ఏసీపీ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



**పట్నంలో జింకల కనికట్టు** ▸ కేపీహెచ్‌బీ నుంచి జేఎన్‌టీయూ వెళ్లే రోడ్డులో ఫ్లై ఓవర్ కింద నందన వనంలో గంతులు వేస్తున్నట్లు ఏర్పాటు చేసిన జింకల బొమ్మలు వాహనదారులను ఆకట్టుకుంటున్నాయి.

# ఇంట్లోనే వైన్ తయారీ

**కెమికల్ ఇంజినీర్ అరెస్టు.. 30 లీటర్ల వైన్ స్వాధీనం**



అక్రమంగా మద్యం తయారు చేసి విక్రయిస్తున్న ఇంజినీర్‌ను అరెస్ట్ చేసి అదుపులోకి తీసుకున్న శేరిలింగంపల్లి ఎక్సైజ్ శాఖ పోలీసులు

మాదాపూర్, జనవరి 30 : ఇంట్లో అక్రమంగా వైన్ తయారు చేసి విక్రయిస్తున్న కెమికల్ ఇంజినీర్‌ను ఎక్సైజ్ పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈస్ట్ గోదావరి జిల్లాకు చెందిన సైదుదేవి సుమన్ కృష్ణ (30) ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తూ అమీన్‌పూర్‌లో నివాసముంటున్నాడు. గత కొన్ని రోజులుగా ఇంటివద్ద వైన్ తయారు చేసి విక్రయిస్తున్నాడు. ఈ నెల 30న మధ్యాహ్నం 1:30 గంటల సమయంలో చందానగర్ బస్‌స్టాప్ వద్ద ఓ వ్యక్తికి లీటరు వైన్ రూ.850కి విక్రయిస్తుండగా శేరిలింగంపల్లి ఎక్సైజ్ శాఖ, టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి అదుపులోకి తీసుకున్నారు. అతడి ఇంట్లో సోదాలు చేసి 30 లీటర్ల డబ్బాలో 29 లీటర్ల మద్యాన్ని గుర్తించి సీజ్ చేశారు. ఈ దాడుల్లో డీటీఎఫ్ శంషాబాద్ ఎస్సై జి.శ్రీకాంత్‌రెడ్డి, శేరిలింగంపల్లి ఎస్సై శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

## ఎల్బీస్టేడియం చుట్టూ
# ట్రాఫిక్ ఆంక్షలు

సిటీబ్యూరో, జనవరి 30 (నమస్తే తెలంగాణ) : ఎల్బీస్టేడియంలో నర్సు రిక్రూట్‌మెంట్ సందర్భంగా ఎల్బీస్టేడియం పరిసరాల్లో బుధవారం మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 7 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు నగర ట్రాఫిక్ అదనపు సీపీ విశ్వప్రసాద్ తెలిపారు. ఏఆర్ పెట్రోల్ బంక్ నుంచి బీజేఆర్ విగ్రహం వైపు వెళ్లే వాహనాలను నాంపల్లి వైపు మళ్లిస్తారు. బషీర్‌బాగ్ నుంచి ఏఆర్ పెట్రోల్ బంక్ వైపు వచ్చే వాహనాలను ఎస్‌బీహెచ్, అబిడ్స్, నాంపల్లి స్టేషన్ రోడ్డుకు మళ్లించనున్నట్లు అదనపు సీపీ వెల్లడించారు.